ఈరోడ్ ఈస్ట్ తీర్పు నేడు

● ఉదయం 10 గంటలకే ఫలితాలు ?



ఓట్ల లెక్కింపు జరిగే ఐఆర్‌టీటీ ప్రాంగణం

అడయార్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు శనివారం ఉదయం నుంచి ప్రారంభంకానుంది. ఈ ఉప పోరు ఫలితం ఉదయం 10 గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ ఆకస్మిక మృతితో ఉప ఎన్నిక నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నెల 5వ తేదీన జరిగిన పోలింగ్‌లో మొత్తం 2,27,546 మంది ఓటర్లకు గాను 1,54,657 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను సిద్దోట్టిలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీకి చేర్చి నాలుగంచెల భద్రతను కల్పించారు. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపు శనివారం ఉదయం ప్రారంభం కానుంది. ఇందుకోసం స్థానిక ఎన్నికల అధికారులు అన్ని రకాల ఏర్పాటు చేశారు. ఈ ఓట్ల లెక్కింపులో భాగంగా, ఈరోడ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్లను ఉదయం 5 గంటలకు లెక్కిస్తారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఇంజనీరింగ్ కాలేజీ పూర్తిస్థాయి కౌంటింగ్ ప్రారంభిస్తారు. మొత్తం 17 రౌండ్లలో ఈ ఓట్ల లెక్కింపు జరుగనుంది. తుది ఫలితం మాత్రం ఉదయం 10 గంటలకే వెల్లడయ్యే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిగా వీసీ చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా సీతాలక్ష్మి సహా మొత్తం 46 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ఉప ఎన్నికను బహిష్కరించిన విషయం తెల్సిందే.



లబ్ధిదారులకు సహాయాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి

మా పాలన శాశ్వతం

● తిరునల్వేలి సభలో సీఎం స్టాలిన్ ధీమా



తిరునల్వేలి ఇరుట్టుకడై హల్వా రుచిచూస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ ఉద్యమ నేత పెరియార్, డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలందిస్తున్న ఆదరణను చూస్తుంటే ఇక రాష్ట్రంలో తామే శాశ్వతంగా పరిపాలిస్తామనే నమ్మకం కలుగుతోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఐదేళ్లలో దక్షిణాది జిల్లాలైన తిరునల్వేలి, తూత్తుకుడి, విరుదునగర్ జిల్లాల రూపు రేఖలే మారటం ఖాయమని, పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా ఈ జిల్లాలను అభివృద్ధిచేస్తామని ఆయన శపథం చేశారు. తిరునల్వేలి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి మైదానంలో శుక్రవారం జరిగిన సభలో తిరునల్వేలి జిల్లాలో రూ.1304.66 కోట్లతో పూర్తయిన ప్రభుత్వ పథకాలను ఆయన ప్రారంభించారు. వీటిలో తామ్రభరణి, కరుమేనియారు, నంబియారు నదీజలాల అనుసంధాన పథకం, మానూరులో ఫుడ్ పార్కు తదితర పథకాలున్నాయి. అదే విధంగా రూ.309.05 కోట్లతో నిర్మించిన 20 కొత్త పథకాలకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత వివిధ సంక్షేమ పథకాలకింద 75 వేలమందికి పైగా లబ్ధిదారులకు సహాయాలను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తిరునల్వేలి సీమలో పర్యటించడం తనకెంతో ఆనందంగా ఉదని, చేర, పాండ్య, చోళ రాజుల పాలన అయినా, విజయ నగరరాజుల పాలన అయినా, చివరకు బ్రిటిష్ పరిపాలన అయినే ఎవరి పాలనలో అయినా తిరునల్వేలి ప్రధాన నగరంగా ఉండేదన్న విషయాన్ని ఎవరూ మరిచిపోరన్నారు. 17 యేళ్లపాటు తెల్లదొరలపై పోరుసాగించిన పులిదేవర్ జన్మించిన సీమ కూడా ఇదేనని చెప్పారు. మూసి ఉంచిన నెల్లయప్పర్ ఆలయం ఉత్తర, పడమ, తూర్పు ద్వారాలను డీఎంకే ప్రభుత్వ హాయంలోనే తెరిచామన్నారు.

బీజేపీ హల్వానే బెస్ట్...

తిరునల్వేలి నగర పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం నెల్లయప్పర్ ఆలయం ఎదురుగా ఉన్న ఇరుట్టుకడై హల్వా తాను రుచిచూడటాన్ని బీజేపీ నేతలంతా విమర్శించారని, తమిళ ప్రజలకు హల్వా ఇస్తారా? అంటూ యెద్దేవా చేస్తున్నారని, వాస్తవానికి గత మూడేళ్ల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు మంజూరు చేయడం లేదని, గత రెండేళ్లుగా విత్తమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి పథకాలు పకటించక తమిళ ప్రజలకే హల్వా ఇచ్చారన్నారు. ఆ హల్వానే తిరునల్వేలి హల్వా కంటే చాలా గొప్పదని స్టాలిన్ వ్యంగ్యంగా పేర్కొన్నారు. గత యేడాది తిరునల్వేలి తదితర జిల్లాలో వరదలు సంభవించినా బాధితులను ఆదుకునేందుకు చిల్లిగవ్వ కూడా కేంద్రంలోని బీజేపీ పాలకులు విదిలించలేదని ఆయన విమర్శించారు. బడ్జెట్‌లో రెండేళ్లుగా రాష్ట్రానికి మొండిచెయ్యి చూపుతున్న ఘనత కూడా ప్రధాని మోదీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కేంద్రం నుండి నిధులు ఆగిపోయినా, తామే అష్టకష్టాలు పడి నిధులను సమకూర్చి ప్రజలకు పలు సంక్షేమపథకాలు అమలు చేస్తున్నామని, విదేశీ పెట్టుబడిదారులతో ఒప్పందాలు కుదుర్చుకుని కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధికల్పిస్తున్నామని చెప్పారు. ఈ సభలో తిరునల్వేలి జిల్లా వాసులకు ఆరు వరాలను ప్రకటిస్తున్నట్లు ఆయన చెబుతూ నాంగునేరి తాలూకా మరుకాలకురిచ్చి, తిరువరమంగైపురం గ్రామాల్లో 2291 ఎకరాల విస్తీర్ణం సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని, తిరునల్వేలి నగరంలో పాళయం కోట బస్‌స్టేషన్, ఎంజీఆర్ బస్‌స్టేషన్ నడుమనున్న కులవణిగర్‌పురం రైల్వేమార్గం వద్ద 'వై' ఆకారంలో రూ.120 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మిస్తామని చెప్పారు. తిరునల్వేలి కార్పొరేషన్ మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటుచేసి తామ్రభరణి నది కాలుష్యం కాకుండా కాపాడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అప్పావు, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, కేఆర్ పెరియ కరుప్పన్, గీతా జీవన్, అనితా ఆర్ రాధాకృష్ణన్, పి. మూర్తి, ఎంపీ రాబర్ట్ బ్రూస్, ఎమ్మెల్యేలు అబ్దుల్ వహాబ్, రూబీ ఆర్.మనోహరన్, నయినార్ నాగేంద్రన్, తిరునల్వేలి మేయర్ కే రామకృష్ణన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ కేపీ కార్తికేయన్, కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ ఎన్ఓ సుఖపుత్రా, నాబార్డ్ సీజీఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




ముఖ్యమంత్రి స్టాలిన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డీఎంకే ఐటీ విభాగం జిల్లా సమన్వయకర్తలు శక్తి సీతారాజవర్మన్, ప్రేమ్‌ఆనంద్, బాలా తదితరులు



దైవానై సమేతంగా స్వామివారు

తిరుప్పరంకుండ్రం తెప్పోత్సవం

నేత్రపర్వం



తీర్థకొలనులో తెప్పను లాగుతున్న భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక తెప్పోత్సవం శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. జనవరి 29న ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన వజ్రాల రథోత్సవం గురువారం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉత్సవ మూర్తి సన్నిధిలో సుబ్రహణ్యస్వామి, దైవానై అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణ చేశారు. ఆ తర్వాత జీఎస్టీరోడ్డులోని తీర్థకొలనులో ఉన్న తెప్పపై స్వామివారు ఆశీనులయ్యారు. ఆ తర్వాత భక్తులు తెప్పను మూడుసార్లు కొలనులో ప్రదక్షిణ చేయించారు. ఇదే విధంగా శుక్రవారం రాత్రి ఇష్టసఖి దైవానై సమేతంగా స్వామివారు తెపోత్సవంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వర్ణ అశ్వవాహనంపై స్వామివారిని ఊరేగించారు. సన్నిధి వీధిలో శూరసంహార లీలావిశేష ఘట్టం నిర్వహించిన మీదట ప్రధాన వీధుల్లో ఊరేగారు.



పళని క్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులు

పళనిలో పాదయాత్ర భక్తుల సందడి...

ఇదిలా ఉండగా ఈ నెల 11న పళని దండాయుధపాణి ఆలయంలో జరుగనున్న తైపూస ఉత్సవాలను పురస్కరించుకుని చెట్టినాడు ప్రాంతాల నుండి కావళ్లతో వేలాది మంది భక్తులు వస్తున్నారు. ప్రతియేటా తైపూసం సందర్భంగా కారైక్కుడి, దేవకోట, కానాడుకాత్తాన్, కండనూరు ప్రాంతాలకు చెందిన నాట్టుకోట్టై నగరత్తార్ బృందాలు కావళ్లతో పళనిక్షేత్రానికి పాదయాత్రగా వెళ్లటం ఆనవాయితీ. ఆ మేరకు గత వారం రోజులుగా ఆ ప్రాంతాల నుండి వచ్చే పాదయాత్ర భక్తులంతా పళని క్షేత్రం చేరుకుని స్వామివారిని దర్శిస్తున్నారు. నత్తం మారియమ్మన్ ఆలయం సమీపం వానియర్ భజనం మఠం వద్ద భక్త బృందాలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత నెమలి పింఛాల కావళ్లతో భక్తులంతా పాదయాత్రగా పళనికి బయలుదేరారు. ఈ బృందం వజ్రాల వేలాయుధంతో ఊరేగింపుగా పళని పర్వతాలయం వైపు వెళ్లారు. దీంతో పర్వతాలయం అంతటా భక్తుల సందడి అధికమైంది.

మాతృభాషపై మమకారం పెంచుకోండి

● ఆచార్య సీఎంకే రెడ్డి



విద్యార్థులతో డాక్టర్ సీఎంకే రెడ్డి, ఎమ్మెల్యే వెట్రి అళగన్, ఆచార్య సంపత్‌కుమార్, గాయకుడు రాము తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను మరువరాదని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్), శ్రీ కనక దుర్గా తెలుగు పాఠశాల (ఎస్కేడీటీ) అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి తెలుగు కుటుంబాలకు పిలుపునిచ్చారు. విల్లివాక్కంలోని ఎస్కేడీటీ మహోన్నత పాఠశాల 78వ వార్షికోత్సవం, క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో ఆచార్య సీఎంకే రెడ్డి అధ్యక్షతన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అతిథులగా విల్లివాక్కం ఎమ్మెల్యే వెట్రి అళగన్, ప్రాచీన తెలుగు విశిష్ఠ అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సీఎంకే రెడ్డి మాట్లాడుతూ, తమిళ భాష నేర్చుకునేందుకు ఈ రాష్ట్రంలో స్థిరపడిన తెలుగువారికి ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే అమ్మభాషలో చదువుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. వృత్తి రీత్యా ఈ రాష్ట్రంలో స్థిరపడిన తెలుగు కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను మాతృభాషలోనే చదివించి అమ్మభాషకు ఘనత చేకూర్చాలని సీఎంకే రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వెట్రి అళగన్ మాట్లాడుతూ, తెలుగు మీడియం విద్యార్థులు మాతృభాషలో చదువుకునేందుకు, పరీక్షలు రాసేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చించి, త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహకులు డాక్టర్ సీఎం కిషోర్, కార్యదర్శి పోరూరి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు తాళ్లూరి సురేష్, శేషగిరిరావు, ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎం.రాము ప్రజాదరణ పొందిన కొన్ని తెలుగు సినిమాల్లోని పాటలు ఆలపించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మోహన్‌నాయుడు వార్షిక నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

అన్నావర్సిటీ అత్యాచారం కేసులో

'ఆ సార్' ఎవరో తేల్చండి


● డీఎండీఎంకే సభలో తీర్మానం



డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత

ప్యారీస్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అన్నా వర్సిటీల విద్యార్థిని అత్యాచారం కేసులో 'ఆ సార్' ఎవరో ఇప్పటి వరకు తెలియలేదని, అతడిని వెంటనే అరెస్టు చేయాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. కోయంబేడులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రేమలత అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, పుదుకోట సామాజిక సేవకులు జగబర్ అలీ, ఆ పార్టీ ప్రముఖుడు కేఆర్ రామలింగం చిత్రపటాలకు ప్రేమలత నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ, డీఎండీకే జెండాను పరిచయం చేసి 25ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా జరుపుకోవాలని ఆమె పార్టీ జిల్లా కార్యదర్శులకు సూచించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్న 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. తెంకాశి, పుదుకోట, తిరుచ్చి, వేలూరు ప్రాంతాల్లోవున్న రాళ్ళ, ఇసుక క్వారీలను ఇష్టానుసారంగా దోచుకుంటున్న నేపథ్యంలో, ప్రస్తుతం మళ్లీ 13జిల్లాలను ఇసుక క్వారీలను నడిపేందుకు ఎంపిక చేసినట్లు డీఎంకే ప్రభుత్వం ప్రకటించడం ఖండించదగ్గదన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తితో సంబంధాలున్న ఆ సార్ ఎవరో ఇప్పటివరకు తెలియలేదని, అతడిని అరెస్టు చేయాలని ప్రేమలత డిమాండ్ చేశారు.

పెరియార్‌నగర్ ఆస్పత్రికి రూ.84 కోట్లు



చెక్కు అందుకుంటున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గం పెరియార్ నగర్‌లో రూ.213 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రికి వైద్యపరికరాలు, యంత్రాల కొనుగోలు కోసం చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ (సీఎండీకే) రూ. 84.17 కోట్ల మేరకు నిధులను సమకూర్చింది. శుక్రవారం ఉదయం ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించేందుకు వెళ్ళిన సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యంకు ఆ నిధులకు సంబంధించిన చెక్కు అందజేశారు. ఏడంతస్థుల్లో ఆస్పత్రి భవన నిర్మాణ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఈ నెలాఖరులోగా పూర్తవుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించిన తర్వాత మంత్రులు మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో హెల్పింగ్ సెంటర్, రూట్‌మ్యాప్, స్నాక్స్ సెంటర్, వెయిటింగ్ రూమ్ తదితర సదుపాయాలు కూడా ఉంటాయని చెప్పారు. సీఎండీఏ చరిత్రలోనే ఇంత భారీస్థాయిలో వైద్యపరికరాల కొనుగోలు కోసం నిధులు కేటాయించడం ఇదే ప్రప్రథమమని చెప్పారు. మార్చి 1న ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకలు జరుగుతాయని, ఆ సందర్భంగా ఈ నెల 28నే ఈ ఆస్పత్రి ప్రారంభిస్తామని చెప్పారు. మంత్రులతోపాటు మేయర్ ప్రియ, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సుప్రియాసాహు, రాష్ట్రగృహనిర్మాణ నగరశివారు ప్రాంతాల అభివృద్ధి శాఖ కార్యర్శి కాకర్ల ఉషా, సీఎండీఏ సీఈఓ శివజ్ఞానం తదితరులు పర్యటించారు.

సమాచార దర్శిని

11న రిజిస్ట్రేషన్ కార్యాలయాలుంటాయి

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్నిరిజిస్ట్రేషన్ కార్యాలయాలు 11వతేదీ యథావిధిగా పని చేయనున్నాయి. భూములు, ఇళ్లు కొనుగోలు చేసే వారు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తుంటారు. శుభ ముహూర్తాలు, విశేష రోజుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో, తైపూసం రోజైన 11వ తేది ప్రభుత్వ సెలవు. ఆ రోజున అధికంగా రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశముండడంతో మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని, ఆ రోజున రిజిస్ట్రేషన్లపై అదనపు రుసుము వసూలు చేయనున్నట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా మొగప్పేర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కులుగుతుందని అధికారులు తెలిపారు. అంబేడ్కర్ నగర్, 9వ మెయిన్ రోడ్డు, మొగప్పేర్ ఈఆర్ఐ స్కీమ్, 8వ వీధి, గోల్డన్ ఫ్లాట్స్, గోల్డన్ కాలని, లావణ్యం అపార్ట్‌మెంట్, ఫైర్ సర్వీస్ క్వార్టర్స్, మొగప్పేర్ రోడ్డు, సత్య నగర్, మదియళగన్ నగర్, చర్చి రోడ్డు, స్కూల్ వీధి ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ముందుగా విద్యుత్ బిల్లులు చెల్లించండి.. 2.70 శాతం వడ్డీ పొందండి

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గృహాల్లో విద్యుత్ బోర్డు ఉద్యోగులు, విద్యుత్ వినియోగం లెక్కించి ఇచ్చే బిల్లులను 20 రోజుల్లోపు చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత తేదిలోపు బిల్లులు చెల్లించని పక్షంలో కనెక్షన్ కట్ చేస్తుంటారు. అనంతరం, జరిమానాతో బిల్లు చెల్లించిన తర్వాత కనెక్షన్ పునరుద్ధరిస్తుంటారు. పొరుగు ప్రాంతాలకు వెళ్లడం, ఇతరత్రా కారణాలతో పలువురు వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించలేకపోవడంతో విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తుంటారు. ఈ సమస్య పరిష్కరించేలా ముందుగానే విద్యుత్ బిల్లులు చెల్లించే సదుపాయం కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలులో ఉన్నట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ ముందుగానే చెల్లించే విద్యుత్ బిల్లులకు 2.70 శాతం వడ్డీ చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఫ్లోటింగ్ రెస్టారెంట్‌లో ఛార్జి ఒకరికి రూ.1,400లు

పెరంబూర్,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ముట్టుకాడు బోట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్‌రెస్టారెంట్ ఒకరికి రూ.1,400 చార్జీగా నిర్ణయించారు.రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముట్టుకాడులో పడవసవారీ అందుబాటులో ఉంది. పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా కేరళ రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేటు సంస్థతో ఒప్పందం చేసుకున్న పర్యాటకాభివృద్ధి సంస్థ ఏసీ సదుపాయం ఉన్న నౌకా రెస్టారెంట్‌ను ఏర్పాటుచేసింది.తొలుత ఈనౌకలో ప్రయాణించేందుకు గ్రూపుగా వచ్చేవారికే అనుమతులిచ్చిన నేపథ్యంలో, తాజాగా ఒక్కరికి కూడా అనుమతించారు. ఆ ప్రకారం, మాంసాహార, శాఖాహార వంటకాలు, శీతల పానీయాలతో కూడిన భోజనం, సంగీత కచ్చేరి మధ్య నడిచే ఈ ఫ్లోటింగ్ రెస్టారెంట్‌లో ఒకరికి రూ.1,400 ఛార్జీగా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలలకు నిరంతర విద్యుత్ సరఫరా

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రాక్టికల్స్ జరుగుతుండంతో, ఆయా పాఠశాలలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ బోర్డు ఆదేశించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ తరగతులకు పబ్లిక్ పరీక్షలు మార్చిలో ప్రారంభం కానున్నాయి. అలాగే, సైన్స్ పాఠ్యాంశానికి సంబంధించిన ప్రాక్టికల్స్ శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ అంశంపై విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ప్రాక్టికల్స్ జరుగనున్న పాఠశాలలకు ఉదయం 5 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఇందుకోసం ఆయా పాఠశాలల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించి నిర్వహణ ఇంజనీర్లు పర్యవేక్షించాలని విద్యుత్ బోర్డు తెలియజేసింది.

ఐసిఎఫ్‌కు మారనున్న విల్లివాక్కం బస్టాండ్

పెరంబూర్,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మెట్రోరైలు పనుల కారణంగా విల్లివాక్కం బస్టాండ్‌నుండి నడుపుతున్న బస్సులు ఈనెల 9నుండి ఐసిఎఫ్‌నుంచి బయల్దేరనున్నాయి. ఈ మేరకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... ప్రస్తుతం విల్లివాక్కం బస్టాండ్‌నుంచి నడుపుతున్న నెం.20, 27డి, 23వి బస్సులు ఐసిఎఫ్ బస్టాండ్ నుంచి బయల్దేరనున్నాయి. నెం.43 ఎస్, 44 ఎస్ మినీ బస్సులు యథావిధిగా విల్లివాక్కం బస్టాండ్ నుండి నడువనున్నాయి. అలాగే, విల్లివాక్కం వరకు నడిపే నెం.22ఎం కొరట్టూరు వరకు, నెం.63ఎం ఐసిఎఫ్ వరకు పొడిగిస్తున్నట్లు ఎంటీసీ తెలిపింది.

'తోళి' వసతిగృహాల్లో అదనంగా వెయ్యి పడకలు

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి ఉద్యోగాల కోసం వచ్చే మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'తోళి' వసతిగృహ పథకం అమలు చేస్తోంది. వాటిలో తక్కువ ధరకు భోజనం, వసతి కల్పిస్తున్నారు. ప్రస్తుతం చెన్నై, వేలూరు, విల్లుపురం, పెరంబలూరు, సేలం, తిరునల్వేలి, తంజావూరు, తిరుచ్చి తదితర జిల్లాల్లో ఈ వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చేపాక్కం, తరమణి, సెయింట్ థామస్ మౌంట్‌లో ఉన్న తోళి వసతి గృహాల్లో అదనంగా వెయ్యి పడకల వసతి కల్పించనున్నారు. ఆ ప్రకారం, చేపాక్కం స్టేడియం సమీపంలో ఉన్న వసతిగృహంలో అదనంగా 500, తరమణిలో 450, సెయింట్ థామస్ మౌంట్ వసతి గృహంలో 120 పడకలు అదనంగా ఏర్పాటుచేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.

12 నుంచి 'ధర్మనిధి ఉపన్యాసాలు'

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరం సమీపంలోని మద్రాసు విశ్వవిద్యాలయంలో ఈ నెల 12,13 తేదీల్లో 'ధర్మనిధి ఉపన్యాసాలు' జరుగనున్నాయి. ఈ మేరకు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు ప్రకటన విడుదల చేశారు. మెరీనా తీరంలోని రజతోత్సవ ప్రాంగణంలో రెండు రోజులు జరుగనున్న కార్యక్రమంలో, 'రాజుపాళెం తెలుగు కవులు సాహిత్యం' అనే అంశంపై ఆర్కాటు ప్రకాశరావు, 'తెలుగు, సంస్కృత భాషలు-వైరుధ్యం' అంశంపై ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి, 'జర్నలిజం-మహిళ: చర్చనీయాంశాలు' అంశంపై ఎన్నార్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసాలు జరుగనున్నాయి. అలాగే, 'కన్నడ సాహిత్యంలో-మానవతావాదం' అంశంపై ఆచార్య గంధం అప్పారావు, 'సాహిత్యంలో ఔచిత్యం' అంశంపై ములమూడి ఆదిలక్ష్మి, 'పచ్చని చెట్టంత చరిత్ర-మాడభూషి సాహిత్యం' అంశంపై ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ధర్మనిధి ఉపన్యాసం చేయనున్నారని, ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆచార్య విస్తాలి శంకరరావు విజ్ఞప్తి చేశారు.

మరో ఆరు ఆలయాల్లో అన్నదాన పథకం

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ఆరు ఆలయాల్లో అన్నదానం పథకం గురువారం ప్రారంభమైంది. ఈ విషయమై సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో హిందూ దేవాదాయ శాఖ పద్దుపై జరిగిన చర్చల్లో, ఆలయాల్లో మధ్యాహ్నం అన్నదానం పథకం మరో ఆరు ఆలయాలకు విస్తరించనున్నట్లు ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఆ ప్రకారం మధురవాయల్‌లోని అరుళ్‌మిగు మార్గకచ్చబేశ్వరుడు, పుళల్ అరుళ్‌మిగు తిరుమూలనాథస్వామి, తిరుచ్చి జిల్లా లాల్‌గుడి అరుళ్‌మిగు బిడారి అయ్యనార్, పెరంబలూరులోని అరుళ్‌మిగు ఆపద్రక్షకర్, తిరుప్పూర్ జిల్లా కారతోలివు అరుళ్‌మిగు అళగునాచియమ్మన్, కడలూరు జిల్లా తెన్నంబాక్కంలోని అరుళ్‌మిగు అళగర్ ఆలయాల్లో నిత్యాన్నదానం పథకం గురువారం ప్రారంభమైంది. పుళల్ అరుళ్‌మిగు తిరుమూలనాథస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పాల్గొని, ఈ పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాధవరం ఎమ్మెల్యే సుదర్శనం, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జాయింట్ కమిషనర్ సి.లక్ష్మణన్ తదితరులు పాల్గొన్నారు.



పుళల్ అరుళ్‌మిగు తిరుమూలనాథస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు, ఎమ్మెల్యే సుదర్శనం తదితరులు

తేని మురుగన్ ఆలయంలో ఒంటి కాలిపై గంటసేపు నిలిచిన కోడిపుంజు!



ధ్వజస్తంభం వద్ద ఒంటికాలిపై మూలవిరాట్టును తిలకిస్తున్న కోడిపుంజు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడినాయకనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో తైమాస కృత్తిక, తైపూస వేడుకలు జరుగుతుండగా ఎక్కడి నుంచో వచ్చిన ఓ కోడిపుంజు ఆలయ ధ్వజస్తంభం వద్ద నెమలి విగ్రహం పక్కనే ఒంటికాలి మీద నిలిచింది. గంట సేపు ఆ కోడిపుంజు కదలకుండా ఒంటి కాలిపైనే నిలవటం చూసిన భక్తులు స్వామివారే కోడిపుంజు రూపంలో వచ్చి తపస్సు చేస్తున్నారంటూ పులకించిపోయారు. ఆ కోడిపుంజును కొందరు ఫొటోలు తీసినా కదలలేదు. అలా గంటపాటు ఒంటి కాలిపై నిలిచిన కోడిపుంజు కళ్లు తెరచి అక్కడి నుండి ఎగురుకుంటూ బయటకు వెళ్ళిపోయింది.. మురుగ పెరుమాన్‌కు తమిళంలో 'సేవర్‌కొడియోన్' అనే పేరు కూడా ఉంది. అంటే తన పతాకంలో కోడిపుంజు చిహ్నాన్ని పొందుపరచిన వాడని అర్థం. ఇలా స్వామివారికి ఇష్టమైన కోడిపుంజు ఆలయం ఎదుట అదీ ధ్వజస్తంభం వద్ద గంటపాటు ఒంటికాలిపై కళ్లు మూసుకుని తపస్సు చేయడడం చూసి భక్తులు, ఆలయ అధికారులు విస్మయం చెందారు.

పాఠశాలకు గ్రామస్తుల సారె



పాఠశాలకు సారె తీసుకొస్తున్న గ్రామస్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వడమదురై తుమ్మలగుండు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో శతవార్షికోత్సవం సందర్భంగా సారె అందజేశారు. పంచాయతి అధ్యక్షుడు నిరుబరాణి గణేశన్ నేతృత్వం వహించగా, తాలూకా విద్యాధికారి మురుగేశ్వరి సహా వార్డు సభ్యులు పాల్గొన్నారు. నాలుగు జతల బెంచ్ డెస్క్‌లు, గోడ గడియారం, నేతల ఫొటోలు, విద్యా సామగ్రి, పూలు, పండ్లతో కూడిన తాంబూలం మంగళవాయిద్యాలు, బాణాసంచా నడుమ గ్రామస్తులు ర్యాలీగా పాఠశాలకు తీసుకొచ్చి ప్రధానోపాధ్యాయులు చౌడేశ్వరికి అందజేశారు.

తాబేళ్ల కళేబరాల పోస్టుమార్టంపై వెటర్నరీ వైద్యులకు శిక్షణ




తాబేళ్ల పోస్టుమార్టంపై వైద్యులకు వివరిస్తున్న నిపుణులు

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన తాబేళ్లకు పోస్టుమార్టం నిర్వహించడంపై వెటర్నరీ వైద్యులకు అటవీ శాఖ నిపుణులు శిక్షణ ఇచ్చారు. సముద్రం నుంచి తాబేళ్లు తీరానికి చేరుకొని ఇసుకలో గుంతలు తవ్వి గుడ్లు పెట్టి వెళుతుంటాయి. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా సుమారు వెయ్యికి పైగా తాబేళ్లు మృతిచెంది తీరానికి కొట్టుకొచ్చాయి. తాబేళ్ల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించిన అటవీ శాఖ అధికారులు, వాటిని తీరంలోనే పూడ్చిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో వండలూరు జూ పార్క్‌లో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో తాబేళ్ల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించడంపై వెటర్నరీ వైద్యులకు శిక్షణ ఇచ్చారు. గాయపడిన తాబేళ్లకు చికిత్స, మృతిచెందిన వాటికి పోస్టుమార్టం నిర్వహించడం తదితరాలపై శిక్షణలో వివరించడంతో పాటు ప్రాక్టికల్‌గా చేసి చూపారు. ఈ శిక్షణలో సుమారు 25 మందికి పైగా వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు.

నేడు మెట్రోవాటర్ బోర్డు గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం గ్రీవెన్స్ జరుగనుంది. ఈ విషయమై మెట్రో వాటర్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో తాగునీటి సరఫరా, ఇతర సమస్యలు పరిష్కరించేలా ప్రతి నెలా రెండో శనివారం నగరంలోని 15 మండల వాటర్ బోర్డు కార్యాలయాల్లో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల గ్రీవెన్స్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగనుందని, వినియోగదారులు శిబిరంలో పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని మెట్రోవాటర్ బోర్డు తెలిపింది.

క్యాబేజీ కిలో రూ.2



కాయలు కోస్తున్న రైతులు

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్యాబేజీ కిలో రూ.2కు పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈరోడ్ జిల్లా తాళవాడి కొండ గ్రామాల్లో రైతులు సుమారు మూడువేల ఎకరాల్లో క్యాబేజీ సాగుచేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.80వేల వరకు రైతులు ఖర్చు పెడుతున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో ఈ ఏడాది దిగుబడి పెరిగింది. ఈ నేపథ్యంలో, కొద్ది రోజులుగా క్యాబేజీ కిలో రూ.10 నుంచి రూ.20 వరకు ఉండగా, ప్రస్తుతం కిలో రూ.2కు పడిపోయింది. ఈ ధరకు ఇస్తే కూలీల ఖర్చు కూడా రాదని, అలాగని పంట విక్రయించకపోతే పూర్తిగా దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల నుంచి క్యాబేజీ కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

10న ఢిల్లీలో అన్నాడీఎంకే కార్యాలయం ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో నిర్మించిన అన్నాడీఎంకే పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 10 వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రారంభించనున్నారు. ఢిల్లీలోని సాకేత్ ప్రాంతంలో మూడంతస్తుల పార్టీ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. నిర్మాణ పనులన్నీ ముగియడంతో ఈ నెల 10 ఈపీఎస్ ప్రారంభించనున్నారు.

నెల రోజుల్లో 25 మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు : జీసీసీ

ప్యారీస్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో గత నెల రోజుల్లో 24,963 మెట్రిక్ టన్నుల చెత్త తొలగించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. జీసీసీ పరిధిలోని జోనల్ కార్యాలయ ఆధ్వర్యంలో ఘనవ్యర్థాల రీసైక్లింగ్ విజవంతంగా కొనసాగుతోంది. రోజుకు 5,900 ఘన వ్యర్థాలను తొలగిస్తున్నారు. నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టిన జీసీసీ అధికారులు 200 వార్డుల్లో చెత్త, రోడ్లపైవున్న భవన నిర్మాణ వ్యర్థాలను, పోస్టర్లు, ప్రకటన బోర్డులను తొలగిస్తున్నారు. ఉత్తర చెన్నైలోని తండయార్‌పేట, రాయపురం, తిరువీకానగర్, సెంట్రల్ చెన్నైలోని అన్నానగర్, దక్షిణ చెన్నైలోని తేనాంపేట, కోడంబాక్కం, అడయార్ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో గత నెల రోజుల్లో 24,963 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించినట్లు జీసీసీ తెలిపింది. శుభ్రం చేసిన ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తవేసే వారిపై చర్యలుంటాయని హెచ్చరికలు జారీ అయిన పలువురు నింబంధనలను ఉల్లంఘించారు. అలాంటి వారికి రూ.5వేలు జరిమానా విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పుళల్ రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టం

ప్యారీస్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నైకి త్రాగునీరు సరఫరా చేస్తున్న రిజర్వాయర్లలో ఒకటైన తిరువళ్లూరు జిల్లా పుళల్ రిజర్వాయర్ ప్రస్తుతం 20.92 అడుగుల సామర్థ్యంతో నిండుకుండలా దర్శనమిస్తుంది. డ్యాం లో పెరుగుతున్న నీటిమట్టాన్ని ప్రజాపనుల శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. షోలవరంలోని బేబి కాలువ మీదుగా పుళల్ రిజర్వాయర్‌లో 246 అడుగుల మేర నీరు చేరుతోంది. పుళల్ రిజర్వాయర్ నుండి రాజధాని వాసులకు నీటిని శుద్ధీకరించి, కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. గత డిసెంబరు నెలలో కురిసిన వర్షాల కారణంగా ఈ రిజర్వాయర్‌లో గంటగంటకు నీటిమట్టం పెరుగు తుండడంతో డ్యాం భద్రత దృష్ట్యా అధికారులు మిగుల జలాలను సముద్రంవైపు మళ్లించారు. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యంతో నీటితో వుండటంతో శుక్రవారం ఉదయం నుండి అక్కడే మకాంవేసిన ప్రజాపనుల శాఖ అధికారులు రిజర్వాయర్‌లో స్నానాలను నిషేధించారు.

రహదారిపై ఎండిన చెట్టు తొలగించండి

తిరుత్తణి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మున్సిపాలిటీలో రోడ్డుపై ఎండిపోయిన చెట్టు ఎప్పుడు విరిగి పడుతుందన్న విధంగా ఉంది. దీంతో రోడ్డుపై ప్రయాణం చేసే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. వెంటనే ఈ చెట్టును తొలగించాలని ప్రజలు అభ్యర్థించారు.

10న పేరూరు పట్టీశ్వరాలయ కుంభాభిషేకం



యాగశాల కోసం నిర్మించిన భారీ పందిరి

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పేరూరులో పచ్చై నాయకి సమేత పట్టీశ్వరాలయ కుంభాభిషేకం ఈ నెల 10న నిర్వహించనున్నారు. ఆలయ రాజగోపురం, విమానాలు, అన్ని సన్నిధులలో జీర్ణోద్ధరణ పనులు ముగియడంతో ప్రస్తుతం కుంభాభిషేక ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం కుంభాభిషేకం ఏర్పాట్లలో భాగంగా విఘ్నేశ్వర పూజ, యాగశాల పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం యాగపూజలు, మూలికా ద్రవ్యాల ఆహుతి, సాయంత్రం తృతీయ కాల పూజలు, ఇడైకళై, పింగళై పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 10 ఉదయం కుంభాభిషేకం జరునుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్‌బాబు, సెంథిల్‌బాలాజీ తదితరులు పాల్గొననున్నారు. ఈ వేడుకలకు గాను కోవై నుండి ప్రత్యేక బస్సులను కూడా నడపనున్నారు.

ఎంకేబీ నగర్‌లో రూ.75 లక్షల స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంకేబీ నగర్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో రూ.75 లక్షల నగదు పట్టుబడింది. ఈ నగదు హవాలానా కాదాఅనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఎంకేబీ నగర్ 7వ క్రాస్ వీధిలో కానిస్టేబుళ్ళు మహిమైరాజ్, రాజ్ కుమార్ గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారు ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.75 లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించి తగిన ఆధారాలు చూపలేదు. ఆ కారులో వచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకెళ్ళి విచారించారు. ఈ విచారణలో ఉన్నవారు నెల్లూరు చిన్న బజార్‌కు చెందిన విక్కి, లోకేష్‌గా గుర్తించారు. వీరిద్దరూ నెల్లూరులో సొంతంగా బంగారు దుకాణం, నగల తయారీ షాపు నడుపుతున్నారని ఒకసారి, రెట్టేరిలో నిర్మిస్తున్న అపార్టుమెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు నగదుతో వచ్చినట్టు మరోమారు ఇలా మార్చిమార్చి చెప్పడంతో నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని ఆదాయపన్ను శాఖ ఉన్నతాధికారికి అప్పగించారు. అలాగే, ఈ నగదును నిజంగానే బంగారు నగలు కొనుగోలు చేసేందుకు తెచ్చారా లేక హవాలా మనీనా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

కరింబేడు పాఠశాలలో కళావేదిక



కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు కరింబేడులోని ప్రభుత్వ పాఠశాలలో రూ.6లక్షలతో నిర్మించిన కళావేదికను అరక్కోణం ఎంపీ జగద్రక్షగన్, ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల పీటీఏ అధ్యక్షుడు కరింబేడుకుమార్, హెచ్ఎం జాక్సన్, ఉపాధ్యాయులు అతిథులను సత్కరించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

ఆలస్యంగా వెళ్లిన విమానాలు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర శివారు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ఉదయం వేళల్లో మంచు విపరీతంగా కురుస్తుంది. శుక్రవారం వేకువజామున చెన్నై విమానాశ్రయం ప్రాంతాల్లో విపరీతంగా మంచుకురిసింది. దీంతో వాహన రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడుతుంది. ఇదిలావుంటే, శుక్రవారం చెన్నై నుంచి వెళ్ళాల్సిన రెండు విమాన సర్వీసులు ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి. స్వదేశీ టెర్మినల్‌లో ఉదయం 8.30 గంటలకు న్యూఢిల్లీ వెళ్ళాల్సిన విమానం ఉదయం 11 గంటలకు బయలుదేరింది. అలాగే, ఉదయం 11.40 గంటలకు ముంబై వెళ్ళాల్సిన విమానం దాదాపు 3 గంటల ఆలస్యంగా వెళ్ళింది. దీంతో విమానాశ్రయంలో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

జాలర్లు, పడవలను విడిపించాలి

● పార్లమెంటు వద్ద రాష్ట్ర ఎంపీల ధర్నా



ఆందోళనలో రాష్ట్ర ఎంపీలు

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో బందీలుగా ఉన్న రాష్ట్ర జాలర్లను విడుదల చేయాలని కోరుతూ పార్లమెంటు ప్రాంగణంలో రాష్ట్ర ఎంపీలు ధర్నా చేపట్టారు. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని ఆరోపిస్తూ రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేస్తున్న ఘటనలు నిత్యం జరుగుతున్నాయి. శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లను విడిపించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో, శ్రీలంక జైళ్లలో ఉన్న 97 మంది జాలర్లు, స్వాధీనం చేసుకున్న 210 పడవలు విడిపించాలని కోరుతూ శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంటు ప్రాంగణంలో డీఎంకే పార్లమెంటరీ పక్ష నేత కనిమొళి నేతృత్వంలో ఎంపీలు ధర్నా చేపట్టారు. శ్రీలంక ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం చర్చించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీలు డిమాండ్ చేశారు.

● ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు

లాయర్‌కు బెయిల్ నిరాకరణ

ప్యారీస్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన న్యాయవాది హరిహరన్ బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. ఓల్డ్ వాషర్‌మెన్‌పేటకు చెందిన న్యాయవాది హరిహరన్ ఆమ్‌స్ట్రాంగ్ హత్య చేసేందుకు వినియోగించిన బాంబులను హైకోర్టు ప్రాంగణంలో నేరస్థులకు అందజేశారని ఆయనపై కేసు నమోదు చేసిన పోలీసులు న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు అరెస్టు చేసి జైలుకి తరలించారు. 112రోజులకు పైగా జైలులో ఉన్న హరిహరన్, తనను బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ, దాఖలు చేసిన పిటిసన్‌పై విచారణ జరిపిన ఎగ్మోర్ మేజిస్ట్రేట్ కోర్టు ఆయన బెయిల్ పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో 17వ నిందితుడిగా చేర్చిన హరిహరన్‌పై పోలీసులు అదనపు ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తన బెయిల్ పిటిషన్ తోసిపుచ్చుతూ ఎగ్మోర్ మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ హరిహరన్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. శుక్రవారం న్యాయమూర్తి వేల్ మురుగన్ ముందు ఈ పిటిషన్ విచారణకు రాగా, పిటిషనర్ తరుపు న్యాయవాది, పోలీసుల తరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. అనంతరం న్యాయవాది హరిహరన్‌కు బెయిల్ నిరాకరిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

13 మంది జాలర్లకు రూ.50వేల చొప్పున జరిమానా

ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష ● తీర్పు చెప్పిన శ్రీలంక కోర్టు

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు దాటారని శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన 17 మందిలో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష, మరో 13 మందికి తలా రూ.50వేల జరిమానా విధిస్తూ శ్రీలంక న్యాయస్థానం శుక్రవారం తీర్పు చెప్పింది. రామేశ్వరానికి చెందిన 36 మంది జాలర్లు సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించింది. వీరిలో 19 మందిని మూడు రోజుల క్రితం శ్రీలంక న్యాయస్థానం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, మిగిలిన 17 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా, వారిలో పడవ నడిపిన ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష, మరో 13 మందికి తలా రూ.50వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. మరో ఇద్దరి వేలిముద్రల నమోదు సక్రమంగా లేకపోవడంతో, వారిద్దరి కేసు విచారణ ఈ నెల 12వ తేదీకి న్యాయస్థానం వాయిదావేసింది.

కోవైలో పోలీసుల ఆకస్మిక తనిఖీ

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ రత్నపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు సహా ప్రధాన ప్రాంతాల్లో శుక్రవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కోవై అసిస్టెంట్ కమిషనర్, ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, 50 మంది సాయుధ పోలీసులు మొత్తం 56 మందితో కూడిన బృందాలు బస్టాండ్లు, పార్శిల్ సర్వీస్ కేంద్రాలు, రైలు మార్గాలు, లాడ్జీల్లో తనిఖీలు చేపట్టాయి. అనుమానాస్పదంగా తిరిగే పొరుగు రాష్ట్రాల వ్యక్తులను గుర్తించడం, గంజాయి, గుట్కా సహా మాదకద్రవ్యాల అక్రమ తరలింపు, విక్రయాలు అడ్డుకొనేలా ఈ తనిఖీలు చేపట్టామని, కోవై నగర పోలీసు శాఖ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ఆటోలో కిడ్నాప్,అత్యాచారంపై పోలీసుల విచారణ

ప్యారీస్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం సమీపంలో ఆటోలో కిడ్నాప్ చేసుకెళ్ళియువతిపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం ఆటో యజమానిని విచారించారు. పోలీసుల కథనం మేరకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతి(19) తన స్నేహితురాళ్లతో కలిసినివసిస్తూ, ఓ ప్రవేటుకంపెనీలో పనిచేస్తోంది. సేలంలోవున్న మరో స్నేహితురాలి ఇంటికివెళ్లిన ఆయువతి గతసోమవారం చెంగల్పట్టు జిల్లాలో ఉన్న కీలాంబాక్కం బస్‌స్టేషన్‌లో దిగింది. అక్కడినుండి కోయంబేడు వెళ్లేందుకు ఓషేర్ ఆటోఎక్కింది.ఆటోను రాయపేటకు చెందిన ముత్తమిళ్ సెల్వన్ నడపగా అతని మిత్రుడు దయాళన్ కూడా ఆటోలో ఉన్నాడు. ఆటో తాంబరం దాటి, జనసంచారంలేని ప్రాంతానికి చేరుకున్న సమయంలో ఆ యువతిపై ముత్తమిళ్ సెల్వన్, దయాలన్ కలిసి ఆటోలోనే అత్యాచారానికి పాల్పడి బెదిరించి నెర్పుంద్రం ప్రాంతంలో దించివేశారు. బాధితురాలు గూడువాంజేరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసారు. ఆటో యజమాని రాయపేటకు చెందిన వెంకట్‌పై ఇప్పటికే నగరంలోని పలు పోలీసు స్టేషన్లో 15కు పైగా క్రిమినల్ కేసులున్నట్లు తెలిసింది శుక్రవారం వెంకట్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో

ఎన్ఆర్ కాంగ్రెస్ పోటీ

● పుదుచ్చేరి సీఎం రంగస్వామి



పార్టీ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సీఎం రంగస్వామి

ప్యారీస్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీకి 2026లో జరిగే ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ పోటీ చేయబోతుందని పార్టీ అధ్యక్షుడు, పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి ప్రకటించారు. ఎన్ఆర్ కాంగ్రెస్ 15వ వార్షికోత్సవం శుక్రవారం పుదుచ్చేరి బీచ్ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి, కార్యకర్తలందరికి స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం ఎన్ఆర్ కాంగ్రెస్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు సీఎం రంగస్వామి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్, డీఎంకే పార్టీల పాలనలో కుంటుపడిన పుదుచ్చేరి రాష్ట్రాభివృద్ధిని ఎన్ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ఎన్డీఏ కూటమిలో ఉంటూ అన్ని వర్గాల ప్రజలు లబ్దిపొందేలా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంలో ఖాళీ పోస్టుల భర్తీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 11 నియోజకవర్గాల్లో పార్టీకి కొత్త నిర్వాహకులను నియమించి సభ్యత్వ నమోదు వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఆర్ కాంగ్రెస్‌పై తమిళనాడు ప్రజల్లో అవగాహన ఉందని, అందువల్ల అక్కడ ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని, దీనికోసం పార్టీ ప్రతి కార్యకర్త ఇప్పటినుంచే సైనికుడిలా పనిచేయాలని సీఎం రంగస్వామి పిలుపునిచ్చారు.



దయచేసి పెళ్లి వార్తలు నమ్మొద్దు

● నిధి అగర్వాల్

తన పెళ్లి గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై దయచేసి నమ్మొద్దు అంటూ హీరోయిన్ నిధి అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. రవి మోహన్ నటించిన 'భూమి' అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ... ఆ తర్వాత శింబుతో 'ఈశ్వరన్', ఉదయనిధితో 'కళగ తలైవన్' సినిమాల్లో నటించారు. ఆ తరవాఆత ఒక్క తమిళ చిత్రంలోనూ నటించలేదు. పైగా నిధి అగర్వాల్ మరో కొత్త సినిమాకు సంతకం చేసి మూడేళ్ళు అయింది. దీనికి కారణం లేకపోలేదు. తెలుగులో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందుతున్న 'హరిహర వీరమల్లు', రెబల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్' పాన్ ఇండియా మూవీల్లో నటించారు. ఈ రెండు మూవీలు ఈ యేడాది ప్రేక్షకుల ముందుకురానున్నాయి. 'హరిహర వీరమల్లు' మూవీలో నటించేందుకు ఒప్పందంపై సంతకాలు చేసేముందు.. ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యేంత వరకు మరో సినిమాలో నటించకూడదన్న షరతుకు అంగీకరించారు. ఫలితంగా నిధి అగర్వాల్ మూడేళ్ళుగా మరో కొత్త చిత్రంలో నటించలేని పరిస్థితి నెలకొంది. అదేసమయంలో నిధి అగర్వాల్ పెళ్ళి చేసుకోబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. దీన్ని ఆమె తోసిపుచ్చారు. ఇలాంటి ప్రచారాన్ని దయచేసి నమ్మొద్దని పేర్కొన్నారు.

నా ఉత్సాహానికి కారణం క్రియా యోగా: రజనీకాంత్



ఇపుడు తాను ఎంతో ఉత్సాహంగా ఉన్నట్టు పలువురు చెబుతున్నారని, దీనికి కారణం క్రియా యోగా అని సూపర్‌స్టార్ రజనీకాంత్ వెల్లడించారు. ఇటీవల జార్ఖండ్ రాష్ట్రంలోని వైఎస్ఎస్ రాంచీ ఆశ్రమానికి వెళ్ళిన ఆయన కొన్ని రోజులపాటు ఉన్నారు. ఈ ఆశ్రమంలో తాను పొందిన అనుభవాన్ని ఒక వీడియో రూపంలో రికార్డు చేయగా, ఆ వీడియోను రాంచీ ఆశ్రమ నిర్వాహకులు తాజాగా విడుదల చేశారు. ఇందులో రజనీకాంత్ మాట్లాడుతూ, 'వైఎస్ఎస్ రాంచీ ఆశ్రమానికి మూడుసార్లు వచ్చాను. పరమహంస యోగానంద గదిలో కూర్చొని యోగా చేసే భాగ్యం దక్కింది. ఆ అనుభవాన్ని మాటల్లో వర్ణించలేను. 14 యేళ్ళ తర్వాత ఈ ఆశ్రమానికి వచ్చాను. ఒకపై ప్రతి యేటా ఆశ్రమానికి వచ్చి ఒక వారం రోజుల పాటు ఇక్కడే గడపాలని నిర్ణయం తీసుకున్నాను. ఇపుడు నేను ఎంతో ఉత్సాహంగా (వైబ్) ఉన్నానని, నన్ను చూస్తే ఒక పాజిటివ్ వైబ్ వస్తుందంటున్నారు. దాని రహస్యం క్రియా యోగా సాధన. 2002 నుంచి ఈ యోగా చేస్తున్నాను. ఆరంభంలో ఎలాంటి మార్పు లేదు. అయినప్పటికీ మధ్యలో ఆపలేదు. ఒక దశలో అంటే 12 యేళ్ళ తర్వాత మార్పు కనిపించింది. నాలో శాంతి, ప్రశాంతత లభించింది. క్రియా యోగా శక్తి అది తెలిసిన వారికి బాగా తెలుసు. ఇది అత్యంత రహస్యం. ఇది అందరికీ ఉపయోగపడాలి' అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి



'డ్రాగన్'లో ప్రదీప్ - అనుపమ

నా కాలేజీ సంఘటనలే 'డ్రాగన్' స్టోరీ

● డైరెక్టర్ అశ్వత్ మారిముత్తు

తన కాలేజీ లైఫ్‌లో జరిగిన సంఘటనే 'డ్రాగన్' మూవీ అని ఆ చిత్ర దర్శకుడు అశ్వత్ మారిముత్తు వెల్లడించారు. ఈయన గతంలో 'ఓ మై కడవులే' వంటి హిట్ చిత్రాన్ని తెరకెక్కించి, చిత్రపరిశ్రమ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఇపుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా 'డ్రాగన్' మూవీ రూపొందించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై తెరకెక్కింది. ఇందులోని ఓ పాటను ప్రముఖ హీరో శింబు నేపథ్య గానం చేశారు. ఈ నెల 14వ తేదీ ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల కానున్న ఈ మూవీ గురించి దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ, 'కాలేజీ జీవితంలో జరిగిన మరిచిపోలేని కొన్ని సంఘటనలను ఆధారంగా చేసుకుని స్క్రిప్టు సిద్ధం చేశాను. ముఖ్యంగా నా కాలేజీ జీవితంలో జరిగిన ఒక ముఖ్య సంఘటన ప్రధాన ఇతివృత్తంగా తీసుకున్నాను. 2016 నుంచి 2025 వరకు చెన్నై - వేలూరు మధ్య సాగే స్టోరీ. హీరో రాఘవన్ నిక్ నేమ్ డ్రాగన్. కాలేజీలో ధైర్యవంతుడైన లీడర్. ప్రతి ఒక్కరి దృష్టి తనపైనే ఉండాలని ప్రతి ఒక్క విషయాన్ని పక్కా ప్లాన్ ప్రకారం చేస్తుంటాడు. దీంతో కాలేజీలో ప్రతి ఒక్కరూ ఇష్టపడే నాయకుడుగా నిలుస్తాడు.అలా ఉండే విద్యార్థి కాలేజీ విద్యాభ్యాసం పూర్తి చేసుకుని బయటకు వచ్చిన తర్వాత అతని జీవితం ఎలా ఉంటుందన్నదే ఈ చిత్ర కథ. కాలేజీ ప్రిన్సిపాల్‌గా మయిల్‌వాగన్‌గా దర్శకుడు మిష్కిన్, రాఘవన్ ప్రేయసిగా అనుపమ పరమేశ్వరన్, రాఘవన్ తల్లిదండ్రులుగా చిత్రా ధనపాల్, జార్జ్ మరియన్ నటించగా, ఇతర పాత్రల్లో కేఎస్ రవికుమార్, గౌతం వాసుదేవ్ మేనన్, వీజే సిద్ధు, హర్షద్‌ఖాన్, మలేసియా మురుగేశన్ తదితరులు నటించారు. సినిమా స్టోరీ వన్‌లైన్‌లో చెప్పాలంటే కాలేజీ జీవితంలో దేని గురించి ఆలోచించని విద్యార్థి విజయ, పరాజయాలను వివరించే సినిమా ఇది' అని పేర్కొన్నారు.




అనిరుధ్ కారుకు పెట్టిన చలానా రశీదు

నో పార్కింగ్ ఏరియాలో కారు పార్కింగ్

అనిరుధ్‌కు రూ.వెయ్యి అపరాధం

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌కు చెన్నై నగర ట్రాఫిక్ పోలీసులు షాక్ ఇచ్చారు. నో పార్కింగ్ ఏరియాలో కారు పార్కింగ్ చేసినందుకు రూ.వెయ్యి అపరాధం విధించారు. దీంతో ఆయన రూ.వెయ్యి చెల్లించి తన కారు తీసుకెళ్ళారు. అజిత్ కుమార్ - త్రిష జంటగా నటించిన 'విడాముయర్చి' చిత్రం గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. క్రోంపేటలోని వెట్రి థియేటర్‌లో హీరోయిన్ త్రిష, అనిరుధ్, మరికొందరు నటీనటులు కలిసి సినిమా చూశారు. అయితే, థియేటర్ వద్దకు అనిరుధ్ కారు ఆలస్యంగా రావడంతో పార్కింగ్ ప్లేస్ నిండిపోయింది. దీంతో ఆయన తన కారును నో పార్కింగ్ జోన్‌లో పార్క్ చేసి థియేటర్‌లోకి వెళ్ళారు. అలాగే, అజిత్ అభిమానుల్లో చాలా మంది నో పార్కింగ్ ఏరియాలోనే తమ వాహనాలను పార్కింగ్ చేయగా, వెట్రి థియేటర్ వద్ద జీఎస్టీ సాలైలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో అక్కడకు చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు... నో పార్కింగ్ ఏరియాలో పార్కింగ్ చేసిన టూవీలర్స్, కార్లకు కొత్త మోటార్ వాహన చట్టం ప్రకారం అపరాధం విధించారు. వీటిలో అనిరుధ్ కారు కూడా ఉంది.

8న 'అవన్ ఇవల్' విడుదల



'అవన్ ఇవల్'లో ఓ దృశ్యం

ప్రముఖ జర్నలిస్టు జియా కథ, సంగీతం సమకూర్చి దర్శకత్వం వహించిన చిత్రం 'అవన్ ఇవల్'. 7వ తేదీ శనివారం నుంచి రాత్రి 7 గంటల నుంచి కింగ్ పిక్చర్స్ యూట్యూబ్ చానెల్‌లో టెలికాస్ట్ కానుంది. ఇందులో సెబాస్టియన్ అంటోనీ, మీరా రాజ్, ఇస్బెల్లా తదితరులు నటించారు. మరియం థియేటర్స్ నిర్మించిన ఈ సినిమాకు సంగీతం గిలెన్ రాల్స్ అందించారు. ఒకే రాత్రిలో జరిగే క్రైమ్ థ్రిల్లర్ మూవీ. గతంలో 'కల్వ', 'ఎనక్కొరు వైఫ్ వేణుమడా' వంటి షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించిన జియా.. తన మూడో ప్రొడక్ట్‌గా 'అవన్ ఇవల్' తెరకెక్కించారు. ఈ వివరాలను ఆయన వివరిస్తూ, 'తొలి రెండు షార్ట్ ఫిల్మ్‌ల నిర్మాణంలో సంభాషణలకు అధిక ప్రాధాన్యత ఇచ్చాను. ఇందులో డైలాగులు తక్కువగా, విజువల్స్ అధికంగా ఉంటాయి. నా తొలి రెండు షార్ట్ ఫిల్మ్‌ల తరహాలోనే ఇది కూడా పూర్తిగా కమర్షియల్ హంగుల్లో ఉంటుంది' అని పేర్కొన్నారు.

అవిశ్రాంత వైద్యసేవ

రిటైర్ అయినా వదలని స్టెతస్కోప్!

రోగులసేవలో అలుపెరుగని వైద్యురాలు షీలా మోహన్

వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి



ఉద్యోగ విరమణానంతరం ఎంతోమంది ఇంటికే పరిమితమవుతారు. వీలైనంత వరకు విశ్రాంత జీవనానికే మొగ్గు చూపుతుంటారు. జీవితాలకి మనం సంవత్సరాలను జతచేయడం కాకుండా మనం జీవించే సంవత్సరాలకి ప్రాణంపోయాలి, అదే సూత్రాన్ని పాటిస్తూ వయసు పైబడినా వీలైనంత మేర వైద్యం కొనసాగిస్తూ, తాను ఉత్సాహంగా ఉండటమే కాకుండా చిన్నారులకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు డాక్టర్ షీలా మోహన్. తాను పనిచేసిన హాస్పిటల్‌లోనే వారి అవసరం మేరకు వెళ్లి సహాయం చేస్తున్నారు. తన కోసమే బతకడం కాకుండా పదిమందికీ ఉపయోగపడటమే పరమార్థమంటున్నారు. అందుకే రిటైర్ అయినా వైద్యవృత్తిని కొనసాగిస్తూ, మిగిలిన సమయాన్ని ఆధ్యాత్మిక చింతనకు వెచ్చిస్తున్నారు. డాక్టర్ షీలా మోహన్ వైద్యప్రస్థానం నేటి 'తరుణి'లో...

చెన్నైలోని తెలుగు కుటుంబానికి చెందిన డాక్టర్ షీలా తండ్రి యతిరాజ్ వ్యాపారం చేసేవారు. ఆమె తల్లి సుమిత్ర గృహిణి, ఉమ్మిడి పాండురంగయ్య కుమార్తె. షీలా పుట్టింది చెన్నైలోనే. ఆమెకు ఒక సోదరుడు, ఇద్దరు సోదరీమణులు వున్నారు. హోలీ ఏంజెల్స్ కాన్వెంట్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసి, స్టెల్లా మేరీస్ కాలేజీలో పీయూసీ చదివారు. మెరిట్‌తో ఎంబీబీఎస్ సీటు సంపాదించి మద్రాస్ మెడికల్ కాలేజీలో వైద్య విద్య పూర్తిచేశారు. అక్కడే డీసీహెచ్ కూడా చదివారు. డా.ఎంజీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డీ పట్టా పొందారు.

వైద్యవృత్తిపై ఆసక్తి ఇలా...

తన తాతగారు కాన్సర్‌తో మరణించడం చూశాక డాక్టర్ కావాలని బాల్యంలోనే నిశ్చయించుకున్నారు షీలా. డాక్టర్‌గా వున్న చిన్నాన్న ప్రోద్బలం, ప్రోత్సాహం తోడై డాక్టర్ కావాలన్న సంకల్పం దృఢమయింది.

పత్ర సమర్పణ...

తను పరిశోధన చేసిన 'ఫాంకొని అనీమియా'పై ఎన్నో పత్రసమర్పణలు చేశారు ఆమె. 'డెంగీ ఫీవర్' 'బ్లడ్ కాన్సర్' వున్న పిల్లల్లో ఇస్నోఫిలియా తదితర అంశాలపైన డాక్టర్ షీలా దేశవిదేశాల్లో పత్ర సమర్పణలు చేశారు.



ఫాంకోని అనీమియా రీసెర్చి ఫౌండేషన్ అవార్డు స్వీకరిస్తున్న షీలా మోహన్

పురస్కారాలు...

ఫాంకీజీన్ (FANCI gene)ని కనుగొన్నందుకు చికాగోలో 'డిస్కవరీ అవార్డు' అందుకున్నారు షీలా. మేరీలాండ్‌లో 'బెస్ట్ క్లినికల్ పోస్టర్' అవార్డు కూడా అందుకున్నారు ఆమె. ఇవేకాకుండా మరెన్నో బహుమతులు, పురస్కారాలు పలు ప్రసిద్ధ సంస్థల నుండి అందుకున్నారు.

అభిరుచులు...

డాక్టర్ షీలా ముఖ్యమైన అబిరుచి రుచికరంగా వంటచేయడం. ఎంబ్రాయిడరీ, అప్లిక్‌వర్క్ మొదలైన వాటిల్లో కూడా మంచి నేర్పరి. ఆధ్యాత్మికత వైపు దృష్టి మళ్ళించిన ఆమె స్వామి పరమార్థానంద బోధనలతో ప్రేరణపొందారు.

క్రమశిక్షణతో కూడిన జీవితం...

డాక్టర్ షీలా ప్రతినిత్యం ఉదయం యోగా, వ్యాయామాలతో పాటు, సాయంత్రం వాకింగ్ అంటూ ఒక పద్ధతితో కూడిన జీవనశైలి అనుసరిస్తారు. విశ్రాంత జీవనాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సమయాల్లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జనరల్ హాస్పిటల్ అండ్ రీసెర్చి సెంటర్‌లో తన సహకారాన్ని అందిస్తున్నారు.



షీలా మోహన్ ఎంబ్రాయిడరీ వర్క్

ఉద్యోగ జీవితం...

డాక్టర్ షీలా ప్రారంభంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ హాస్పిటల్ మద్రాస్‌లో మెడికల్ ఆఫీసర్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత బాలమందిర్ ఆర్ఫనేజ్‌లో మెడికల్ ఆఫీసర్‌గా సేవలందించారు. ఆ తరువాత చైల్డ్ స్పెషలిస్టుగా, వలంటరీ హెల్త్ సర్వీసెస్ మెడికల్ సెంటర్‌లో పనిచేశారు. 1999 నుంచి దుర్గా బాయి దేశ్‌ముఖ్ జనరల్ హాస్పిటల్ అండ్ రీసెర్చి సెంటర్‌లో కన్సల్టెంట్ పీడియాట్రిషన్‌గా పనిచేస్తున్నారు.

కుటుంబం...

డాక్టర్ షీలా భర్త మోహన్. బిజినెస్ చేస్తుంటారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు.



కుటుంబసభ్యులతో...

"మనకి జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులకు, జీవనం సజావుగా సాగేందుకు తోడ్పడుతున్న ప్రతి ఒక్కరికి, సమాజానికి ఎల్లవేళ్లలా కృతజ్ఞతగా వుండాలి. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపట్ల శ్రద్ధవహిస్తూ అప్రమత్తతతో ఉండాలి. ముందు జాగ్రత్తలు తీసుకోకుంటే ఎలాంటి రోగాలు మన దరికి చేరవు" అని డాక్టర్ షీలా తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు.

వైద్యవృత్తిలో మరచిపోలేని జ్ఞాపకం...

ఫాంకొని అనీమియా అనేది పిల్లల్లో అరుదుగా వచ్చే జబ్బు. సాధారణంగా దానిని మామూలు రక్తహీనతగా భావించి చికిత్స చేస్తుంటారు. కానీ అది సాధారణమైన రక్తహీనత కాదు. తల్లికి, తండ్రికి డిఫెక్టివ్ జీన్స్ వుంటే వారికి పుట్టిన బిడ్డకు యీ జబ్బు సంక్రమిస్తుంది. డాక్టర్ షీలా ఈ విషయంపై తన అనుభవాన్ని వివరించారు. "ఒకసారి ఆంధ్రప్రదేశ్‌లోని నిడదవోలుకు చెందిన తల్లిదండ్రులు తమ ఆరేళ్ల కుమారుడికి అనీమియా ఉందని చికిత్స చేయమని నా వద్దకు వచ్చారు. ఆ బాబుకి ఫాంకొని అనీమియా. బోన్‌మేరో ట్రాన్స్‌ప్లాంట్ చేసి ప్రాణాలను కాపాడాను. ఆ బాలుడు ఇప్పుడు 36 యేళ్ల యువకుడు. ఇప్పటికీ నాతో ఫోన్‌లో మాట్లాడుతుంటాడు. రోగులకు కొత్తజీవితం ఇచ్చినప్పుడు కలిగే సంతోషాన్ని డబ్బుతో కొలవలేం. ఇలాంటి సంఘటనలు ఎన్నో నావైద్యవృత్తిలో జరిగాయి. అవే నాకు బలమూ, ప్రేరణ" అని తెలిపారు. డాక్టర్ షీలా నిబద్ధత కలిగిన డాక్టర్. వయసుపైబడ్డా ఇంకా వైద్యాన్ని కొనసాగిస్తున్నారు.

770 మంది పోలీసులకు 'ముఖ్యమంత్రి పతకాలు'

● అందజేసిన కమిషనర్ అరుణ్



పతకాలు అందజేస్తున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ, ప్రత్యేక విభాగం పోలీసులు మొత్తం 770 మందికి 'ముఖ్యమంత్రి పతకం' పురస్కారాలను గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ అందజేశారు. రాష్ట్ర పోలీసుల శాఖలో పదేళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న 3వేల మంది పోలీసులకు పతకాలు అందజేయనున్నట్లు సంక్రాంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అందులో, గ్రేటర్ చెన్నై పోలీసు శాఖలో లా అండ్ ఆర్డర్, క్రిమినల్ విభాగాలకు చెందిన 263 మంది పోలీసులు, ట్రాఫిక్ విభాగంలో 172 మంది, సాయుధ విభాగం, మోటారు వాహనాల విభాగాలకు చెందిన 12 మంది, ఇంటెలిజెన్స్, కేంద్ర నేర విభాగం, ఆధునిక పోలీసు విభాగం సహా పలు విభాగాలకు చెందిన 515 మంది, ఇతర ప్రత్యేక విభాగాలకు చెందిన 225 మంది అని మొత్తం 770 మందికి పతకాలు అందజేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎగ్మూర్‌లోని రాజారత్నం స్టేడియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ పాల్గొని, పోలీసులకు పతాకాలు ప్రదానం చేశారు.

హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రైఫిల్ క్లబ్ ప్రారంభం



రైఫిల్ క్లబ్ ప్రారంభించి తుపాకీ గురిపెడుతున్న మాజీ డీజీపీ శైలేంద్రబాబు, హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం పడూరులోని హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూలులో కొత్తగా ప్రారంభించిన రైఫిల్ క్లబ్‌ను మాజీ డీజీపీ శైలేంద్రబాబు ప్రారంభించారు. హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్స్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శైలేంద్రబాబు మాట్లాడుతూ తుపాకీతో లక్ష్యం కేసి గురిచూసి పేల్చటం అత్యంత సామర్థ్యంతో కూడుకున్న విద్య అని, విద్యార్థులు రైఫిల్ షూటింగ్‌లోనూ రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆనంద్ జేకబ్ వర్గీస్ మాట్లాడుతూ అభినవ్ బింద్రా, గగన్‌నారంగ్, అపూర్వి చందేలా, సౌరబ్ చౌదరి వంటి మేటి షూటర్లను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఈ క్రీడపై కూడా దృష్టిసారించాలని పిలుపునిచ్చారు.



చెన్నై మెరీనాబీచ్‌లోని వివేకానందర్ ఇల్లమ్‌లో జరిగిన వివేకానంద నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్, ఎన్నెల్సీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి, ప్రముఖ వ్యాపారవేత్త నల్లి కుప్పుసామిశెట్టి

నేటినుంచి కోవై వ్యవసాయ వర్శిటీలో 'పుష్ప ప్రదర్శన'

పెరంబూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్‌లో పుష్ప ప్రదర్శన శనివారం ప్రారంభం కానుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యానవన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ పుష్ప ప్రదర్శన పలు విశేషాలతో రూపొందింది. లక్షలాది పూలతో రూపొందించిన వివిధ రకాల నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రదర్శనను వ్యవసాయ శాఖ మంత్రి పన్నీర్‌సెల్వం, విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ, విశ్వవిద్యాలయ ఉపకులపతి గీతాలక్ష్మి ప్రత్యేక అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు. ప్రదర్శన ప్రాంగణంలో ఫుడ్ కోర్ట్‌లు, వినోద కార్యక్రమాలు, వివిధ వస్తువులతో స్టాల్స్ ఏర్పాటుచేసినట్లు, ఐదు రోజులు ఈ ప్రదర్శన జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.



ప్రదర్శనకు పూల కుండీలు సిద్ధం చేస్తున్న విద్యార్థులు



పుష్ప సోయగాలతో బొటానికల్ పార్క్



పూలతో రూపొందించిన ప్రవేశ ద్వారం



విరబూసిన బంతి పూలు

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ

● కార్మికులకు నిప్పో పరిశ్రమ నిబంధన



హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులను విధుల్లోకి అనుమతించబోమని తడ మండలంలోని నిప్పో పరిశ్రమ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు పరిశ్రమ ప్రధాన గేటు వద్ద నోటీసులు అంటించింది. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని యాజమాన్యం పేర్కొంది. ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించింది.

- తడ, ఆంధ్రజ్యోతి

నైమిశారణ్యంలో వైభవంగా శ్రీవారి కల్యాణం, చక్రస్నానం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని నైమిశారణ్యంలోని బాలాజీ ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణశేషాచల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకబృందం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠాపన, యజమాని సంకల్పం, భక్తసంకల్పం, మహా సంకల్పం, మాంగళ్యపూజ, మంగళ సూత్రధారణ వంటి ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే, గోమతి నది తీరంలో శుక్రవారం చక్రస్నానాన్ని నిర్వహించారు. నదీతీరంలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.23 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,908

తలనీలాలు సమర్పించినవారు: 19,549

కూటమిలో ట్రబుల్ షూటర్స్



తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ఎన్నిక వైసీపీ రాజకీయ నైజాన్ని ఎరిగిన అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. దబాయింపులకు తగ్గకుండా, బెదిరింపులకు లొంగకుండా వైసీపీ జెండాతో కార్పొరేటర్లుగా గెలిచిన ఇంత మందిని ఎలా కూడగట్టగలిగారన్నదే చర్చగా మారింది. 'రాష్ట్రంలో అధికారం మనదైనా.. తిరుపతి కార్పొరేషన్‌లో అంతా వాళ్లే.. అబ్బే.. అసాధ్యం' అనుకుంటున్న సమయంలో ట్రబుల్ షూటర్స్ రంగంలోకి దిగారు. వ్యూహ నైపుణ్యాలను వెలికి తీశారు. గెలిపించి .. వైసీపీని దడిపించి చూపించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తెరవెనుక ఎన్వీ ప్రసాద్

తిరుపతి డిప్యూటీ మేయర్‌ను టీడీపీకి టర్న్ చేయడంలో ప్రధాన వ్యూహకర్త తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్. తెరవెనుక నుంచే కథ మొత్తం నడిపారు. తన ప్రధాన అనుచరుడు ఆర్సీ మునికృష్ణను డిప్యూటీ పీఠంపై కూర్చోబెట్టారు. ఎన్వీ ప్రసాద్ ఎన్నికల స్ట్రాటజీపై స్థానిక రాజకీయనాయకులు ప్రత్యేకంగా చెప్పుకుంటుంటారు. తన సినిమాను బ్లాక్‌బస్టర్ చేసేందుకు ఎంత శ్రమిస్తారో, ఎన్నిక క్రతువును తనవైపు తిప్పుకునేందుకు అంతే కష్టపడతారన్న పేరుంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వచ్చినప్పటినుంచి ఆయన సినిమా థియేటర్‌లోని తన ఆఫీస్‌కే పరిమితమైపోయినట్టు కనిపించినా అక్కడి నుంచే చక్రం తిప్పారు. ఆయనకు మరో ముఖ్య అనుచరుడు కార్పొరేటర్ నరసింహాచారి, యువ కార్పొరేటర్ నరేంద్రనాథ్‌ల శ్రమా, సహకారం కీలకమైనవి. కూటమివైపు నిలబడే వారి సంఖ్యను మూడు నెలల క్రితమే ఆ సంఖ్యను 16కు చేర్చారు. వైసీపీ స్థానిక నాయకత్వంపై ఉన్న అసంతృప్తిని కూటమికి అనుకూలంగా మార్చుకోవడంల ఎన్వీ ప్రసాద్ పాత్ర ప్రత్యేకమైనదిగా కూటమి శ్రేణులు చెప్పుకుంటున్నారు.

యూత్ పవర్.. జేబీ

బయట ఎక్కడా కనిపించకపోయినా డిప్యూటీ మేయర్‌గా టీడీపీ ఒకే ఒక్కడు ఆర్సీ మునికృష్ణను గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు జేబీ. రియల్‌ఎస్టేట్ రంగంలో ఉన్న జేబీ శ్రీనివాస్.. రాజకీయాల్లోనూ సమాంతరంగా ప్రయాణిస్తున్నారు. ఎటువంటి పరిస్థితుల్లో అయినా ఆయనను వెన్నంటి ఉండే యూత్ జేబీ బలం. క్లిష్ట పరిస్థితుల్లోనూ అనాయాసంగా పనిని చక్కదిద్దగల సామర్థ్యం ఆయనది. దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ టీడీపీలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఆయనకు అండగా యూత్ ఫోర్స్‌ను దించేవాడు. ప్రత్యర్థి పార్టీలకు దీటుగా నిలబడి వ్యూహాలు రచించడంలోనూ, పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలోనూ గట్టి పట్టుంది. 2019 ఎన్నికల్లో కొర్లగుంట, జీవకోన ప్రాంతాల్లో టీడీపీకి జనరల్ ఏజెంట్‌గా పనిచేసిన జేబీ వర్గం వైసీపీ దౌర్జన్యాలను నిలువరించగలిగింది. ఈ బూత్‌ల్లో వైసీపీకి మెజారిటీ తగ్గిపోవడంతో ఆ తర్వాత అక్రమ కేసుల్లో ఇరికించారు. తిరుపతి అసెంబ్లీ టికెట్ ఆశించినవారిలో జేబీ కూడా ఉన్నారు. వైసీపీ పట్ల అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమివైపునకు మళ్లించడంలో ఈయన పాత్ర చాలానే ఉంది. జేబీ యూత్ ఫోర్స్ బలమేమిటో నిరూపించారు.

'పెదబ్బ' దెబ్బకు పెడబొబ్బ

తిరుపతి రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన కుటుంబం ప్రతినిధిగా మబ్బు దేవనారాయణరెడ్డి (పెదబ్బ)కి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వెరపు ఎరగని నైజం ఆయనది. ముఖాన నవ్వు చెరగకుండానే పరిస్థితులను అదుపులోకి తెచ్చుకోగల చాతుర్యం ఆయన సొంతం. మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందినా మబ్బు పెదబ్బ పేరు నగరంలో మోగుతూనే ఉంటుంది. మబ్బు యువసేన పేరుతో పెద్ద బలగమే ఉంది. తిరుపతి స్థానికుల్లో ఆయనకున్న స్నేహ, బంధుత్వాలే ఆయన బలం. తిరుపతిలో వైసీపీ సై అంటే.. సై అనగల దమ్మున్న నాయకుడిగా గుర్తింపు ఉంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన పెదబ్బ గత ఎన్నికల్లో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో కూటమి విజయానికి మనసుపెట్టి పనిచేశారు. తాజాగా తిరుపతిలో జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆచితూచి అడుగులేస్తూ వైసీపీకి ధాటీగానే సమాధానం ఇచ్చారు.

రవినాయుడు లాస్ట్ పంచ్

నిన్నమొన్నటి దాకా చేతిలో పుస్తకంతో యూనివర్శిటీలో కనిపించిన ఇతనేనా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు అనిమిని రవినాయుడును చూసి ఇప్పుడు. రాష్ట్ర సమస్యల మీద మీడియాలో స్పందించే విద్యార్థి నాయకుడిగా మొదలైన రవినాయుడి రాజకీయ జీవితం లోకేశ్ పాదయాత్రతో కీలక మలుపు తీసుకుంది. కుప్పం నుంచి నెల్లిమర్ల దాకా యువగళానికి రక్షా కవచంలా యువసైన్యాన్ని నడిపించిన సారథిగా గుర్తింపు తెచ్చుకున్నారు. నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి', హలో లోకేశ్.. సభల నిర్వహణ బాధ్యతను సమర్థంగా నిర్వహించారు. సీనియర్లున్నా శాప్‌ఛైర్మన్ పదవి వరించి వచ్చింది ఈ కారణాలవల్లే. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఆఖరి రోజున ఆయన అనుసరించిన వ్యూహ నైపుణ్యాలు వైసీపీ అంచనాలకు అందలేదు. చాపకిందనే అంతా చక్కబెట్టేశారు.

'అన్నా' లెక్కలే వేరు

జీవకోన అనగానే అన్నా పేరు వినిపిస్తుంది. అధికారంలో ఎవరున్నా ఆ ప్రాంతం మీద పట్టు మాత్రం అన్నా రామచంద్రయ్యదే అన్నంతగా జీవకోనతో పెనవేసుకుపోయారు. తన వారసురాలిగా కుమార్తె అన్నా అనితను కార్పొరేటర్‌గా గెలిపించుకున్నారు. వైసీపీలో తీవ్ర అనాదరణకు గురైన ఆయన ఆ తర్వాత అదను చూసి అడుగులు కదిపారు. కుమార్తె అన్నా అనితను మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలనే లక్ష్యం పెట్టుకున్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో అన్నా సత్తా ఏమిటో చూపించారు. జాతీయ రాజకీయ పరిణామాలూ.. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై అనర్గళంగా మాట్లాడగలగడం ఆయన బలం. యాదవసామాజికవర్గంలో పట్టున్న నాయకుడు. వ్యయ ప్రయాసలకు వెనుదీయకుండా డిప్యూటీ ఎన్నికలో కృషి చేశారు.

తీరు సైతం...

డిప్యూటీ మేయర్ ఎన్నిక టీడీపీ వశం కావడానికి ట్రబుల్ షూటర్స్‌కు సమన్వయంగా మరికొంతమంది సహకరించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్. ఎమ్మెల్యే వాయిస్‌గా మదన్ అన్ని సందర్భాల్లోనూ చకచకా నిర్ణయాలు తీసుకుంటూ చురుగ్గా వ్యవహరించారు. కార్పొరేటర్లను శిబిరాలకు తరలించడం, వారి యోగక్షేమాల దాకా బాధ్యతగా చూసుకున్న మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిమహేష్ యాదవ్‌లు శ్రమను కూటమి నాయకత్వం ప్రశంసిస్తోంది.

బదిలీ చేసినా కదలరంతే!

● సదరన్ డిస్కం విద్యుత్ సర్కిల్‌లో ఇదీ సంగతి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారం రోజుల్లోపు రిలీవ్ కావాలి. ఇదీ నిబంధన. కానీ సదరన్ డిస్కం పరిధిలో కొందరు దీనిని అతిక్రమిస్తున్నారు. గతేడాది సెప్టెంబరు 22వ తేదీన బదిలీ చేసినా.. ఇప్పటికీ రిలీవ్ కాలేదు. పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్‌లోని ఆయా కార్యాలయాలతో పాటు ఆపరేషన్ విభాగంలో దీర్ఘకాలంగా ఉన్న వారిని గతేడాది సెప్టెంబరు 22న కార్పొరేట్ కార్యాలయ అధికారులు బదిలీ చేశారు. కొన్ని సంఘాల్లోని వారు ఎక్కువ మంది బదిలీ అయ్యారు. కొందరు మాత్రం పాత స్థానాల్లోనే కొనసాగుతూ.. డివిజన్, సర్కిల్ స్థాయి అధికారుల వద్దకు వెళ్లి తమను రిలీవ్ చేయకుండా చూడాలని కోరినట్లు సమాచారం. కొందరు అధికారులు నోటి మాటతో వీరి బదిలీని అడ్డుకుంటున్నారన్న విమర్శలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అప్పటికప్పుడే కొందరిని రిలీవ్ చేసిన అధికారులు.. మిగతావారి విషయంలో చూసీచూడనట్లు ఉండటం గమనార్హం. ఇలా ఉమ్మడి జిల్లాలో బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారిలో 10 మందికి పైగా మౌఖిక ఆదేశాలతో తిరుపతిలో కొందరు, శ్రీకాళహస్తిలో బదిలీ ఆర్డరు తీసున్న ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు రిలీవ్ కాకుండా కొనసాగుతున్నట్లు తెలిసింది. దీనిపై క్షేత్రస్థాయిలో ఏఈలను వివరణ కోరగా.. ఉన్నత స్థాయి అధికారుల మౌఖిక ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారని చెప్పారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఈఈ చిన్నరెడ్డెప్పను విచారించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. బదిలీ చేసినవారు రిలీవ్ కాలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని సీజీఎం హెచ్‌ఆర్‌డీ రమణాదేవి తెలిపారు. ఆ విషయాన్ని సీఎండీతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాతృభాషతోనే మానసిక వికాసం

● '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాతృభాషతోనే మానసిక వికాసం కలుగుతుందని, విద్య, విజ్ఞానం సమకూరుతుందని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లాకు సంబంధించి రెండు పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తిరుపతిలోని సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృభాషపై పట్టుసాధిస్తేనే ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం సాధించగలమన్నారు.అందుకే విద్యార్థులందరికీ తెలుగు ధారాళంగా చదవడం, మాట్లాడేలా తీర్చిదిద్దేందుకు 'తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమ నిర్వాహకుడు భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ భాస్కర్‌రాజు మాట్లాడుతూ.. 30 రోజుల్లో ధారాళంగా చదవగలిగేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ఓ ప్రోగ్రామ్‌ను రూపొందించి సత్ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం భాస్కర్‌రాజు రూపొందించిన తెలుగుభాష సంజీవిని పుస్తకాలను విద్యార్థులకు డీఈవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో బాలాజీ, డీఈవో కార్యాలయ ఐటీ సెల్ మానిటరింగ్ అధికారి ధనుంజయులు నాయుడు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయిని విజయకుమారి, ఇతర ఉపాధ్యాయులు, భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ రీసెర్చ్ సెంటర్ ఇన్‌స్ట్రక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్‌ఎక్స్‌లో పరిచయం

● ఉద్యోగం పేరిట అసభ్యకర చాటింగ్‌పై ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగావకాశాలను చూస్తుండగా ఓఎల్‌ఎక్స్‌లో పరిచయమయ్యాడు. కార్యాలయం పెడతామంటూ తిరుపతికి వచ్చాడు. ఆపై సినిమాకు, తిరుమలకు వెళ్దామంటూ ఆ మహిళను ఒత్తిడి చేశాడు. ఈ మేరకు బాధితురాలి భర్త శుక్రవారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం కొర్లగుంటకు ఓ వివాహిత ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ఓఎల్‌ఎక్స్‌లో సెర్చ్ చేస్తుండగా హైదరాబాదుకు చెందిన సునీల్‌కుమార్ మొబైల్ నెంబరు అందులో కనిపించింది. ఉద్యోగం కోసం ఆమె అతడితో వాట్సాప్ ద్వారా చాటింగ్ ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం తిరుపతికి వచ్చిన సునీల్‌కుమార్.. ఇక్కడ ఓఎల్‌ఎక్స్ కార్యాలయం పెట్టేందుకు గది చూడాలని చెప్పాడు. ఇద్దరూ అద్దెకు గది కోసం వెదికారు. ఇటీవల హోటల్‌లో భోజనం చేశాక తిరుమలకు వెళ్దామని ఆమెను పిలిచాడు. ఆమె ససేమిరా అన్నారు. తాను లీలామహల్ వద్ద ఉన్నానని, సినిమాకు వెళ్దామంటూ ఆమెతో చాటింగ్ చేశాడు. అతడి వైఖరిని అనుమానించిన ఆమె భర్తకు విషయం చెప్పారు. వెంటనే వారు డయల్ 100కు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. వీరిచ్చిన సమాచారం మేరకు సునీల్‌కుమార్‌ను అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

18 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 26వ తేది వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ ఈవో శ్యామలారావు శుక్రవారం సాయంత్రం తిరుమలలోని ఈవో క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుందన్నారు. 17వ తేది అంకురార్పణ, 18న ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 19న ఉదయం చిన్నశేష, రాత్రి హంస, 20న సింహ, ముత్యపు పందిరి, 21న కల్పవృక్ష, సర్వభూపాల, 22న మోహినీ అవతారం, రాత్రి గరుడ సేవ, 23న హనుమంతు, సాయంత్రం స్వర్ణ రథోత్సవం, రాత్రి గజ వాహనం, 24న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 25న రథోత్సవం, అశ్వవాహన సేవలు ఉంటాయని ఈవో వివరించారు. 26న ఉదయం చక్ర స్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, అర్చకులు పార్థసారథి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో, అధికారులు

వైసీపీకి షాక్

● పార్టీకి జడ్పీటీసీ, ముగ్గురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచులు, కార్యకర్తల రాజీనామా

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డిని పార్టీ నుంచి సస్పెండు చేశారు. ఆయనకు మద్దతుగా జడ్పీటీసీ సభ్యురాలు ఆరణి ప్రతిమ, ఆర్‌అనంతపురం, కాటూరు, ఆలత్తూరు ఎంపీటీసీ సభ్యులు పుట్టయ్య, రవి, వరలక్ష్మి, వెస్ట్‌వరత్తూరు సర్పంచ్ దయా, బీఎన్‌కండ్రిగ సర్పంచ్ మునిరాజా, పలువురు కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం నీర్పాకోటలో ప్రకటించారు. మరికొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు కూడా రాజీనామా చేయనున్నారని జడ్పీటీసీ ప్రతిమ తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటతామన్నారు. వైసీపీ మండల సచివాలయ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు గిరిరెడ్డి, మునస్వామి, భాస్కరయ్య తదితరులున్నారు.

వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యతా ఉండాలి

● మందుల విక్రయదారుల అవగాహన సదస్సులో ఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(వైద్యం),ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'వయసుతో సంబంధం లేకుండా కొందరు పలు రకాల మత్తుకు బానిసలవుతున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టాలంటే మీ సహకారం అవసరం. వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యత కూడా ప్రధానమనే విషయాన్ని మీరు దృష్టిలో పెట్టుకోవాలి' అని జిల్లాలోని ఔషధ విక్రయదారులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులోని ఫ్యాబ్ భవనంలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అందరి సహకారం అవసరమన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలతో పాటు కొందరు మందుల దుకాణాల్లో లభించే పలు మత్తునిచ్చే ఔషధాలకు అలవాటు పడి ఆరోగ్యంతోపాటు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనిని అరికట్టాలంటే డాక్టర్ రశీదు లేకుండా మందులు విక్రయించడం, చిన్నారులకు మందులు విక్రయించడం వంటివి చేయకూడదన్నారు. రశీదులు నిజమైనవా, నకిలీవా అనేది చూసుకోవాలన్నారు. కొన్ని నిషేధిత మందులు, మత్తును ఇచ్చే మందుల విక్రయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించి మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రుయాస్పత్రి డీ అడిక్షన్ సెంటర్ మానసిక వైద్య నిపుణురాలు మానస మాట్లాడుతూ అనుభవంతో ఇచ్చే కొన్ని రకాల మందుల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశముందని తెలిపారు. డాక్టర్ సలహా లేకుండా మందులు ఇస్తే ఎలాంటి నష్టాలు ఉంటాయనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, డీఐవోలు సుభాషిణి, రూతు తదితరులు పాల్గొన్నారు.

మిస్ గ్లోబల్ ఆసియా విజేతకు సీఎం అభినందన

చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన మిస్ గ్లోబల్ ఆసియా పోటీలలో విజేతగా నిలిచిన చంద్రగిరికి చెందిన భావనరెడ్డిని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. విజేతగా నిలిచిన ఆమె తన తండ్రి గోపికృష్ణతో పాటు తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, ఆర్.బాలాజీ, ఆర్.ప్రవీణ్, కోటేశ్వరరావు, శేఖర్, బాషాతో పాటు సీఎం చంద్రబాబును కలిశారు. అంతర్జాతీయ వేదికపై చంద్రగిరి పేరును గట్టిగా వినిపించారంటూ సీఎం ఆమెను ప్రశంసించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, రాంప్రసాద్‌రెడ్డిని కూడా వీరు కలిశారు.



భావనరెడ్డిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

ముమ్మరంగా మహాశివరాత్రి ఏర్పాట్లు



త్రినేత్ర అతిథి గృహం వద్ద రంగులు అద్దుతున్న కళాకారులు






స్వామి అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జంగమయ్య పండుగ మహాశివరాత్రి వేడుకలకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 21వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 26న మహాశివరాత్రి, 27 ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28వ తేదీ అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం, మార్చి 2న గిరిప్రదక్షిణ, 4న పల్లకీ సేవ ఉత్సవాలు ప్రధాన ఘట్టాలు. ఆయా రోజుల్లో జరిగే ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తుల రద్దీ ఉంటుంది. అందుకు అనుగుణంగా భక్తులు బస చేసేందుకు షెడ్లు, ఇతర సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయం లోపల గురువారం రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్నారు. అలాగే ధ్వజస్తంభం, మహద్వారం ప్రదేశాల్లో అద్దిన రంగులు భక్తులను ఆకట్టుకున్నాయి.

డాలర్ కేంద్రం డొల్లతనం

● పాడైన పైకప్పు, ఊడుతున్న గోడపెచ్చులు



తిరుమల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): డాలర్ల విక్రయ కేంద్రం అస్తవ్యస్తంగా తయారైంది. పాడైపోయిన పైకప్పు, ఊడుతున్న గోడపెచ్చులతో ఆందోళన కలిగిస్తోంది. 40 ఏళ్లగా టీటీడీ శ్రీనివాసుడు, పద్మావతి అమ్మవార్లుండే బంగారు, వెండి డాలర్లను విక్రయిస్తోంది. భక్తుల నుంచి మంచి స్పందన వస్తున్న క్రమంలో తొలుత బయోమెట్రిక్, తర్వాత లడ్డూకౌంటర్ల వద్దకు విక్రయకేంద్రాన్ని మార్చారు. భక్తులకు అందుబాటులో ఉండేలా ఆరేళ్ల క్రితం శ్రీవారి ఆలయం ముందున్న పుస్తకవిక్రయశాల వద్ద విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలోని ఈ కౌంటర్ ద్వారా రోజుకు రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విక్రయాలు జరుగుతాయి. పర్వదినాల్లో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు విక్రయాలుంటాయి. అక్షయతృతీయ వంటి రోజుల్లో రూ.75 లక్షల వరకు అమ్మకాలు సాగుతాయి. ఇంత విలువైన కౌంటరు పైకప్పుతో పాటు గోడపెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షమొస్తే రేకుల నుంచినీరు కౌంటర్‌లోకి చేరుతోంది. సిబ్బంది ప్లాస్టిక్ బకెట్లు పెడుతున్నారు. కౌంటర్ వద్ద కనీస భద్రత లేదు. గేట్లకు గొళ్లాలు కూడా లేకపోవడంతో సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల వెండి, రాగి డాలర్ల కోసం వస్తున్న భక్తులు నోస్టాక్ బోర్డు చూసి నిరాశ చెందుతున్నారు.



పాడై పోయిన పైకప్పు, గోడలు